# మిస్ కాంటాక్ట్

సి. వెంకట కృష్ణ

సాయంకాలం కొద్దిగా జల్లు పడింది.

వాన వెలిసిన తరువాత చెట్లకిందా, దుకాణాల చూరుకిందా, ఇళ్ల ఫ్రంటేజ్ కిందా తలదాచుకున్న జనం బిలబిలా రోడ్డు మీదకు రాసాగారు.

ఎదురుగా కేజీ. స్కూలు పిల్లలు గబగబా పరుగెత్తుకొస్తూంటే అద్దాల కిటికీ ముందు నిలబడి చూస్తున్న శ్రీలతకు భయం వేసింది. వేగంగా వచ్చే, పోయే కార్లను చూడకుండా పరుగెత్తుతారు పిల్లలు. పిల్లలున్నారూ, జాగ్రత్తగా నడపాలని కార్ల వాళ్లకు కూడా ఉండదు కాస్తంత జ్ఞానం - అని పిల్లలంతా వెళ్లేంతవరకూ అలాగే నిలబడింది.

చేతి గడియారం చూసుకుంది. సరిగ్గా ఆరైంది. ఎక్కువమంది క్లయింట్స్ రాకపోతే ఇంటికి త్వరగా వెళ్లి విశ్రాంతి తీసుకుంటే బాగుండునని అనుకుంటూ వచ్చి రివాల్వింగ్ ఛెయిర్‌లో కూర్చుంది.

ఢిల్లీ హైకోర్టు, సుప్రీం కోర్టులలో తెలుగు లాయర్స్ సంఖ్య మిగతా వారితో పోల్చి చూస్తే చాలా తక్కువనే చెప్పాలి. అయినా ఆంధ్రప్రదేశ్ నుండి సుప్రీంకోర్టుకు వెళ్లిన న్యాయమూర్తులందరూ చాలా మంచివారని పేరు తెచ్చుకోవటం వలన తెలుగు వారికి ఓ గుర్తింపు ఉందనే చెప్పాలి.

సౌత్ ఎక్స్‌టెన్షన్ పార్ట్ 'టు'లో శ్రీమతి శ్రీలతని ప్రముఖ తెలుగు లాయరు ఉందని తెలిసి సరయు ఎంతో శ్రమపడి వెతుక్కుంటూ శ్రీలత ఆఫీసులో కాలు పెట్టింది.

శ్రీలత ఆఫీసు చాలా నీట్‌గా ఉంది. ముందు ఓ పెద్ద హాలు. అది క్లయింట్స్ కూర్చోవడానికి కేటాయించినది. దాని పక్కనే రెండు గదులున్నాయి. ఒక గదిలో టైపిస్టు, క్లర్కు, ఫైళ్లు ఉన్నాయి. మరో గదిలో నలుగురు జూనియర్ లాయర్లు ఉన్నారు. ముందు హాలు వెనుక మరో హాలు ఉంది. అది శ్రీలత కూర్చునే గది.

టెలిఫోను, పుస్తకాలు వెడల్పాటి బల్ల మీద ఉన్నాయి. గదిలోకి కాలు పెడుతూనే మనో ధైర్యాన్ని కలిగించేటట్లుగా పెద్ద సైజు గాంధీగారి ఫోటో ఉంది.

సరయుని వివరా లడిగి క్లర్క్ లోపలి హాల్లోకి వెళ్లింది. ఏదో ఫైలు చూస్తున్న శ్రీలత తలెత్తి క్లర్క్ మొహంలోకి ఏమిటన్నట్టు చూసింది. విజిటింగ్ కార్డు చూసి, కనుబొమలు చిట్లించింది - 'మిస్ సరయు, హైదరాబాద్'.

"ఓకే! రమ్మను!" అంది.

'ఎవరీ సరయు? ఇంతకు మునుపు విన్న పేరు కాదే! కొత్త క్లయింటా?' అని అనుకుంటూండగా సరయు ప్రవేశించింది.

గుండ్రని మొహం. సన్నగా, పొడవుగా ఉంది. చామనచాయగా ఉన్నా గుండ్రని పెద్ద కళ్లు, బుగ్గ మీద సొట్ట - ఎంతో బ్యూటీగా ఉంది. గోధుమరంగు గద్వాల చీర సరయుకి బాగా నప్పింది.



"నమస్కారం, శ్రీలతగారూ!" తెలుగులో స్పష్టంగా సరయు పలకరింపు శ్రీలతకి ఎంతో సంతోషం కలిగించింది.

కుర్చీ చూపించి, రెండు మూడు కుశల ప్రశ్నలు వేసింది శ్రీలత సరయుని.

సరయు కొత్తదానిలా ఫీలవకుండా తాను తనకి పరిచయం ఉన్న వ్యక్తి దగ్గరికి వచ్చినట్టుగా అనిపించినా తిరిగి తన కేసు గురించి చెప్పబోతుంటే కళ్ల వెంట గిర్రున నీళ్లు తిరిగాయి.

శ్రీలత నివ్వెరపోయింది. సరయు చాలా 'సెన్సిటివ్ టైప్' అని గ్రహించింది శ్రీలత.

"మిస్ సరయుగారూ! పరవాలేదు. మీరు కేసు గురించి చెప్పక్కర్లేదు. కాగితా లుంటే ఇవ్వండి, నే చదువుకుంటాను" అంది శ్రీలత ఎంతో జాలిగా.

"సారీ, లాయర్‌గారూ! జరిగిన సంఘటనలు ఒక్కసారిగా కళ్ల ముందు నిలిచేటప్పటికి మనసు తట్టుకోలేకపోయింది. సరిగా చెప్పగలుగుతానో, లేనో నని కేసంతా వివరంగా టైప్ చేశాను. చిన్న మనవి - నాకు అన్యాయం జరిగిం దని మీ

రనుకుంటే కేను పోయినా పరవాలేదు, సుప్రీంకోర్టులో ఫైల్ చేసి ప్రయత్నించండి. లాభం లేదనుకుంటే చెప్పండి - నా ప్రయత్నం విరమించుకుంటాను !" అంది.

"థాంక్యూ ! మీరు కోరినట్టుగానే కేసంతా క్షుణ్ణంగా చదివి, నా అభిప్రాయాన్ని చెప్తాను. వారం రోజులు గడువు ఇవ్వండి. వచ్చే ఆదివారం మీరు సరిగ్గా నాలుగు గంటలకు వస్తే బాగుంటుంది" అంది శ్రీలత.

నరయు లేచి వెళ్లబోతుంటే, "మీరు ఉండటానికి ప్రాబ్లమ్ అయితే మొహమాటం లేకుండా చెప్పండి, మా ఇంట్లో ఉండొచ్చు. అభ్యంతరం లేదు !" అంది శ్రీలత



"అవసరం లేదు. ఇక్కడ బంధువుల దగ్గరే ఉంటున్నాను !" అని సెలవు తీసుకుని నరయు వెళ్లిపోయింది.

** ** **

ఇంటికెళ్లి విశ్రాంతి తీసుకోవాలనుకున్న శ్రీలతకు విశ్రాంతి లేకుండా పోయింది. ఇంట్లో ఎవరూ లేరు. ఆఫీసు పని మీద కలకత్తా వెళ్లిన కాశీనాథ్ ఇంకా తిరిగి రాలేదు. కాశీనాథ్ యు.పి. అతను. అతన్ని ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఇద్దరు సంతానం - ఆశ, అర్జున్ - సెలవులకు హైదరాబాదు వాళ్లమ్మగా రింటికి వెళ్లారు.

రెండు రోజులు గడిచాయి. ఎందుకో ఏ పనీ చేయబుద్ధి పుట్టడంలేదు. చటుక్కున నరయు - ఆ అందమైన ... ముఖ్యంగా బుగ్గ మీద సొట్ట - కంటెదుట నిల్చింది.

'మైగాడ్ ! నరయు కేసే ... డామిట్ ! ఎలా మరిచాను?' అని తనలో తాను తిట్టుకుంటూ గబగబా పై గదిలోకి పరుగెత్తి స్టడీ టేబుల్ సొరుగుల్లో నుంచి కాగితాల కవరు తీసుకుని రోడ్డు మీదికి ఉన్న డాబా వరండాలో ఈజీ చెయిర్‌లో నడుమువాల్చి ఫైలు చదవనారంభించింది.

కాగితాలు చాలా నీటుగా టైప్ చేసి ఉన్నాయి. అది కేసు కాదు, నరయు స్వీయ చరిత్రలా ఉంది.

"నా పేరు ... ఈ పాటికి మీకు పరిచయమేగా ! అయినా చెపుతున్నాను మళ్లీ - మిస్ నరయు. మాది చిన్న కుటుంబం. మా నాన్నగారు ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేసి మూడు సంవత్సరాల క్రితం రిటైరయ్యారు. నాన్నగారు షుగర్ పేషెంట్ కూడాను. ఓపిక లేక ఇంటిదగ్గరే ఉంటున్నారు. రిటైర్మెంట్ తరువాత ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుయిటీ వచ్చాయి. దానితో నాలుగు గదుల ఇల్లు కట్టారు. డబ్బు సరిపోక ప్లాస్టరింగ్ రెండు గదులకు చేయించనే లేదు."

'అవునూ, ఛాందసురాలు ! ఈ సోదంతా నా కెందుకు? టూకీగా కేసు చెప్పక !' అని అనుకుంటూ పేజీ తిప్పగానే మొదటి వాక్యంలోనే ఉంది -

"సూటిగా, నీటుగా కే సేమిటో చెప్పకుండా ఈ సోదంతా ఎందుకు రాస్తున్నట్టూ అని

అనుకుంటారేమో! నిజంగానే మీ సానుభూతి పొందటానికి కాదు, ఇంటి పరిస్థితుల ప్రభావం కేసు మీద ఉందని చెప్పటానికి మాత్రమే.'' - ఈ వాక్యం చదివి శ్రీలత నవ్వుకుంది. నిజంగానే సానుభూతి కూడా కలిగింది శ్రీలతకి.

"నా వంతు సాయం ఇంటికి చేయాలనిపించింది. చెప్పటం మరిచాను - మా అన్నయ్య, నాన్నతో తగవు పెట్టుకుని వెళ్ళిపోయి వేరే ఉంటున్నాడు. చెల్లాయి, తమ్ముడు ఇంకా చదువుతున్నారు.

"నా స్నేహితురాలు - నిర్మల సలహా మీదట సెమీ గవర్నమెంట్ ఆఫీసులో స్టెనో-కమ్-క్లర్క్‌గా చేరాను. మంచి జీతం రావటం వలన ఇంటి పరిస్థితులు ఎంతో మెరుగుపడసాగాయి. ఇంటి అప్పులు తీర్చగలిగాను.

"మొదటి రెండు సంవత్సరాలు బాగా గడిచాయి. నాన్నగారు నాకు సంబంధాలు చూడటం మొదలుపెట్టారు."

శ్రీలత పక్కనున్న చిన్న స్టూలు మీద పెట్టుకున్న మంచినీళ్ల గ్లాసు అందుకుని నీళ్లు తాగి, స్టూలు మీద పెట్టేసింది.

కేసు చదవబోతుండగా ఫోను మోగింది. కాగితాలు కుర్చీలో పడేసి ఫోను కోసం గబగబా పరుగెత్తింది.

రిసీవరు ఎత్తి, "హలో!" అంది శ్రీలత.

"హలో డియర్! నేను, కాశీ!"

"కహాఁసే?"

"ఎయిర్ పోర్టు నుండి."

"ఓకే! కారు తెస్తాను. ఎరైవల్ టైమ్?"

"అరున్నర! హాఫ్ . ఆరు ... సిక్స్ ...!"

"ఓకే!"

రిసీవరు పెట్టేసింది.

కాశీ! కాశీని తలుచుకోగానే శ్రీలతకి ఎంతో సంతోషం వేసింది. తన కులం కాదు, భాషా కాదు. అయితే నేం, గుణవంతుడు. తనంటే ప్రాణంగా ఉంటాడు.

వాచీ చూసుకుంది. ఇంకో అరగంటలో బయలుదేరితే తప్ప ఎయిర్ పోర్ట్‌కి చేరలేదు. కేసు కాగితాలు జాగ్రత్తగా సొరుగులో పెట్టింది.

కాశీకి ఇష్టమైన నీలిరంగు షిఫాన్ చీర కట్టుకుని మేకప్ చేసుకుంటుంటే సరయు బుగ్గ మీద సొట్ట, సన్నగా, పొడవుగా ఉన్న పర్సనాలిటీ గుర్తొచ్చింది. తను కూడా సరయులా గుండ్రని చుట్ట పెట్టుకుంటే ఎలా ఉంటుంది అని అనుకుని, గుండ్రని చుట్ట, నుదుట మ్యాచింగ్ నీలిరంగు బొట్టు పెట్టుకుంది.

డ్రెస్సింగ్ టేబుల్ ముందు నుంచి లేచేటప్పటికి ఎయిర్‌పోర్టుకి వెళ్లాల్సిన టైమ్ అయింది.

ఆలస్యంగా బయలుదేరినా ఎయిర్ పోర్టుకి పది నిముషాల ముందే చేరింది.

ఫ్లయిట్ సరిగ్గా సమయానికే వచ్చింది. శ్రీలతకి కాశీని చూడగానే ఆనందం కట్టలు తెంచుకుంది.

కాశీ ప్రేమతో శ్రీలత భుజాలు గట్టిగా ఊపాడు.

"కుఛ్ నయా కేసెస్ లియా క్యా?" అడిగాడు కాశీ శ్రీలత కారులో ఇంటికి వస్తూ.

"అవును. ఓ ఆసక్తికరమైన కేసు వచ్చింది. రేపు ఇద్దరం కలిసి చదివితే బాగుంటుంది" అంది శ్రీలత నవ్వుతూ.

## తిరగరాసిన నవలలు

**టాల్‌స్టాయ్**‌కి తన రచనలను అచ్చయి మార్కెట్‌లోకి వచ్చేవరకూ మారుస్తూ కొత్త విషయాలు చేర్చటం, కొన్ని భాగాలు తీసివేయడం అలవాటుగా ఉండేది. 'గ్లైయిడర్' అనే కథను ఆయన 26 సార్లు తిరగరాశాడు.

సహనం-శాంతి అనే బృహత్తర నవలకు ఆయన భార్య ఏడుసార్లు శుద్ధ ప్రతులు రాసింది. 'సమరము-శాంతి' ప్రపంచంలో అత్యంత పెద్ద నవల. దానిలోని పుటల సంఖ్య 2,400. రచించిన కాలం ఆరు సంవత్సరాలు.

అమెరికన్ నవలా రచయిత ఎర్నెస్ హెమ్మింగ్వే 'ఫేర్ వెల్ టు ఆరమ్స్' అనే నవలలోని ఒక అధ్యాయాన్ని 39సార్లు తిరగరాశాడు. అయితే విదేశీ రచయితలకున్న ఓపిక మన తెలుగు రచయితలకు ఉందంటారా!

సేకరణ : 'సవ్యసాచి' [కర్నూలు]

"ఓకే, శ్రీ!" అన్నాడు కాశీ శ్రీలత నడుము మీద చేయి వేస్తూ.

** ** **

**స**రయుకి అపాయింట్‌మెంట్ ఆదివారం ఇచ్చిన విషయం గుర్తుకు వచ్చి రెండు రోజులు వృథా చేసినందుకు ఎంతో గిల్టీగా ఫీలయింది.

స్టడీ టేబుల్ ముందు కూర్చుని సరయు ఫైలు తీసింది. కాశీని పిలిచి ఎదురుగా కూర్చోబెట్టింది. కాశీకి తాను చదివినంతవరకూ పూస గుచ్చినట్లు చెప్పింది.

"కాశీ! నేను చదువుతాను. నువ్వు కూడా జాగ్రత్తగా ఫాలో కావాలి."

కాశీ సిగరెట్టు వెలిగించి శ్రద్ధగా వినసాగాడు.

"పాత డైరెక్టర్ రిటైర్ అయ్యారు. ఆయనకు సిబ్బంది అంతా కలిసి వీడ్కోలు చెప్పాం. మూడో రోజుకి కొత్త డైరెక్టర్ వచ్చారు. ఆయన పేరు సుందరం. రిటైర్మెంట్ ఇంకా రెండేళ్లుంది. మనిషి తెల్లగా, బొద్దుగా ఉంటాడు. గుండ్రని మొహం, బట్టతల, వెడల్పాటి నుదుటిపై త్రిపుండ్రం దిద్ది, భ్రుకుటి మీద చందనం బొట్టు, దానిపై కుంకుమ బొట్టు పెడతాడు. మెడలో లావుపాటి రుద్రాక్షమాల ధరిస్తాడు.

"చాలా నెమ్మదిగా మాట్లాడతాడు. క్రమశిక్షణ విషయంలో నిర్మొహమాటంగా ఉంటాడని, మంచి మేధావి అని పేరుంది.

"వచ్చిన రోజున ఒక్కొక్కరినీ గదిలోకి పిలిపించుకుని ఆప్యాయంగా పలుకరించాడు. నేను గదిలోకి వెళ్లేసరికి నవ్వుతూ పలకరించి, నా కుటుంబ వివరాలు తెలుసుకున్నాడు. నాతో మాట్లాడుతున్నంతసేపూ నన్ను కన్నార్పకుండా చూస్తూనే ఉన్నాడు. ఎంతో ఇబ్బందిగా అనిపించింది. నాకు అతని మీద సదభిప్రాయం కలగలేదు. అలాగే మా సీనియర్ క్లర్క్ నిర్మల, మరో ఎల్.డి.సి. సూపరింటెండెంట్ శాస్త్రి గారికి సుందరం గారి మీద సదభిప్రాయం కలగలేదు.

"అన్నట్టు ఆరోజు నాతోనే ఎక్కువసేపు మాట్లాడాడు. నిర్మలగారితో సుందరం గురించి నా అభిప్రాయం, నా చిన్న అనుభవం గురించి చెప్పాను.

"కొందరు ముసలాళ్లకి చిలిపి పనులు అలవాట్లుంటాయి అని విన్నాను. ఎందుకైనా మంచిది నీ జాగ్రత్తలో నువ్వుండు. అందులోనూ నీకు పెళ్లి కాలేదు. చనువు తీసుకోవచ్చు" - అని హెచ్చరించింది నిర్మల."


చదువుతుంటే, మధ్యన ఆపి, "శ్రీ! దట్ ఫెలో ఈజ్ బద్మాష్ యార్!" అన్నాడు కాశీ.

"అలాగా!" అన్నట్టు శ్రీలత త లూపింది.

"ఆ మరునాడు నా సర్వీసు రిజిస్టర్ తెప్పించి, నన్ను ఎంతగానో పొగిడాడు. ఎంతోకాలంగా నాకు రావలసిన ఇంక్రిమెంట్స్ శాంక్షన్ చేశాడు. మొదటిరోజు మీరు అని సంబోధించి, రెండో రోజు నుంచి 'నువ్వు' అని అనటం ప్రారంభించాడు. నాకు ఎంతో భవిష్యత్ ఉందని, ప్రమోషన్ కూడా ఇస్తా నన్నాడు. పని బాగా చేయాలనీ, తనను మెప్పించాలని కూడా చెప్పాడు. ఆ రోజు ఏం తిథో నాకు తెలియదు - బహుశా రాహుకాలంలో బాస్‌ని చూసి ఉంటాను. నా కన్నీటి కథ ప్రారంభమైంది.

"రోజూ ఆఫీసుకు రాగానే పొద్దునపూట తప్పనిసరిగా నేను షార్ట్‌హేండ్ పుస్తకంతో ఆయన ముందు ప్రత్యక్షం కావాలి. అలా చేయాలని ఆయన ఆర్డరు.

"డిక్టేషన్ ఇస్తున్నంతసేపూ కన్నార్పకుండా ఒళ్లంతా తడిమినట్టుగా చూసేవాడు. ఒంటినిండా పమిట కప్పుకుంటే, 'ముసలిదానివా! నిండుగా కప్పుకున్నావ్?' అని మందలించేవాడు. కట్టుకున్న చీర గురించి కామెంట్ చేసేవాడు. 'అతి పలుచని చీరలు చాలా బాగుంటాయి! అలా ఎందుకు రావు' అని వేధించేవాడు.



"మళ్లీ సాయంకాలం ఇంటి కెళ్లేముందు పని ఉన్నా లేకపోయినా పిలిచేవాడు - అది కూడా ఇంటికి వెళ్లేముందు. తప్పనిసరిగా అరడజను లెటర్స్ డిక్టేట్ చేసేవాడు. అందువల్ల చచ్చినట్టు వెయిట్ చేయక తప్పేది కాదు. నిజంగా పని లేకపోయినా, పని సృష్టించేవాడు.

"రెండు సార్లు ఆఫీసు టైమింగ్స్ తరువాత వెళ్లినందుకు మెమోలు ఇచ్చాడు. ఇదేమిటని అడిగితే, 'టేకిట్ ఈజీ' అని అప్పుడని, ఈ రోజు వాటిని ఆయుధాలుగా నా మీద ప్రయోగిస్తున్నాడు. నన్ను తన గుప్పిట్లో పెట్టుకోవడానికి అలా చేశాడని అర్థమవుతోంది. పై అధికారులంతా కూడా ఆయన మనుషులే.

"రోజూ ఏదో రకంగా నేను అవమానాలు, ఈసడింపులకు గురయ్యేదాన్ని. డిక్టేషన్ తీసుకుంటుంటే మంచినీళ్లకనో, ఫైల్ కోసమో తప్పనిసరిగా లేవాల్సివచ్చేది. అలా లేచినప్పుడు నా నడకను గురించీ, నడుము గురించీ వ్యాఖ్యానించేవాడు. ద్వంద్వార్థాలతో మాట్లాడేవాడు. ఎవరితోనైనా చెబుదామంటే, నన్ను ఎవరూ నమ్మేవారు కాదు. అందరితో పరోక్షంగా నా గురించి గొప్పగా చెప్పేవాడు. ఏదైనా ఒకరోజు బాగుండక సెలవు పెడితే, ఆ మర్నాడు అతి సున్నితంగా, నెమ్మదిగా, బూతుగా తిట్టేవాడు. అలా అన్న రోజు ఏడుస్తే, 'గదిలోకి వచ్చేముందు ఏడుస్తూ వచ్చినా, గదిలో నుంచి వెళ్లేముందు నవ్వుతూ వెళ్లాలి' అని అనేవాడు.

"నా ప్రవర్తన మీద కొందరికి అనుమానం కలిగింది. అది వాళ్ల తప్పు కాదు. పరిస్థితులలా ఉన్నాయి. నాలో సహనం క్రమంగా నన్నగిల్లింది. నా మిత్రులకీ, కొలీగ్స్ అందరికీ మరోసారి విషయమంతా వివరించి చెప్పాను. అందరూ సానుభూతి చూపించారే కానీ, పరిష్కారం చెప్పలేదు. నేనూ, నిర్మలా స్త్రీ ఉద్యమ నాయకులతో కూడా సంప్రదించాము. నన్ను తిరగబడమన్నారు. నాకు మద్దతుగా ఓ రోజు ధర్నా చేస్తామన్నారు. 'నా ఉద్యోగం పోతే ఏం చేయాలి?' అన్నదానికి వారు సమాధానం చెప్పలేకపోయారు.

"ఒకరోజు మా అమ్మకీ, నాన్నకీ ఈ విషయమంతా చెప్పాను. నాన్నగారికి విపరీతమైన కోపం వచ్చింది, 'వెధవను, కాలర్ పట్టుకుని కొడతాను! వాడికి కూతుళ్లు లేరా?' అని అన్నారు. అమ్మ కన్నీళ్లు పెట్టుకుంది. 'పిచ్చితల్లీ! ఇన్ని అవమానాలు భరిస్తూ ఈ సంసారాన్ని పోషిస్తున్నావా?' అని ఎంతగానో వాపోయింది.

"నిజమే, నాన్నగారు అన్నంత పని చేయగలరు. కాని, దాని పర్యవసానం! ఉద్యోగం పోవటం, వీధిన పడటం!

"నా స్నేహితులు నిర్మలతోనూ, సూపరింటెండెంట్ శాస్త్రిగారితోను చర్చించాను. పరిష్కార మార్గానికి - మొదటి మెట్టు వెంటనే ఉద్యోగానికి రాజీనామా చేసి, మరో ఉద్యోగం వెతుక్కోవటం. రెండవది - ట్రాన్స్‌ఫర్ చేయించుకోవటం. మొదటిమార్గం అవలంబిస్తే మళ్లీ ఉద్యోగం దొరకటం చాలా కష్టం. రెండవది ఎంతమటుకు - ముఖ్యంగా సుందరం అడ్డు పడితే ఫలిస్తుందో తెలియలేదు. ఫలించనట్లయితే రాజీనామా తప్పదని నిర్ణయించుకున్నాను. ఏదైనా వారం రోజుల్లో తేల్చేయాలని నిర్ణయించుకున్నాను. నాన్నా అమ్మా కూడా నా నిర్ణయాన్ని పూర్తిగా సమర్థించారు.

"నా అదృష్టం కొద్దీ రెండు రోజులు సుందరం గారికి జ్వరం వచ్చిందని సెలవు పెట్టాడు. తిరిగి సుందరం డ్యూటీలో జాయిన్ అయ్యే రోజుకి నాకు ఆరోగ్యం బాగాలేదని నేను సెలవు పెట్టాను. ఈలోపు ట్రాన్స్‌ఫర్ ప్రయత్నం. గట్టిగా చేయసాగాను. కొందరు మిత్రుల సహాయంతో వేరే సెక్షన్‌కి, అంటే స్టోర్స్‌కి ట్రాన్స్‌ఫర్ అయితే బాగుంటుందని తెలుసుకుని, వారి ద్వారా ప్రయత్నించసాగాను. నా ప్రయత్నానికి అసిస్టెంట్ డైరెక్టర్ తోడ్పడతా నని చెప్పి దరఖాస్తు కూడా తీసుకున్నాడు.

"శనివారం ఆఫీసుకు వెడితే, ఆదివారం ఎలాగూ సెలవు. సోమవారం నాటికి బదిలీ జరిగిపోతే సుందరం పీడ విరగడవుతుందని ఆలోచించుకుని ఆఫీసుకు వెళ్లాను.

"సుందరం టేబుల్ మీద ఆ రోజు చాలా ఫైళ్లు పేరుకుని ఉన్నాయి. చాలా ఫోన్ కాల్స్ కూడా వచ్చాయి. పొద్దునంతా బిజీగా ఉండి, నన్ను పిలవనే లేదు. బ్రతుకుజీవుడా! ఇంకో అరగంటే గడిస్తే ఈ నరకం నుండి బయటపడవచ్చు అని అనుకుంటూండగా సుందరం నుండి కబురు వచ్చింది. అంతకు మునుపే నిర్మల నా కోసం వెయిట్ చేస్తూంటే వెళ్లమని చెప్పాను. దాదాపు స్టాఫ్ అంతా వెళ్లిపోయారు. ఒకరిద్దరు ఉండిపోయారు - ఎరియర్స్ ఆఫ్ వర్క్ పూర్తి చేస్తూ.

"చేయగలిగింది లేక నెమ్మదిగా షార్ట్‌హేండ్ పుస్తకంతో వెళ్లాను.

"గదిలోకి కాలు పెడుతూనే అన్నాడు - 'డిక్టేషన్ ఇవ్వటానికి కాదు పిలిచింది! నిన్ను చూసి చాలా రోజులైంది. కూర్చో, రెండు నిముషాలు కబుర్లు చెప్పుకుందాం' అన్నాడు.

"నాన్నగారికి ఆరోగ్యం బాగాలేదు, డాక్టరు దగ్గరకు తీసుకెళ్లాలి. ఇంటికి త్వరగా వెళ్లాలి. ప్లీజ్!" - అన్నాను.

" 'సరూ!' ఒంటరిగా ఉన్నప్పుడు అలాగే పిలిచేవాడు. 'కథలు చెప్పకు! నీకు నిజంగానే అవసరముంటే చెప్పు, నా కారు ఇస్తా! ఏం కావాలన్నా ఇస్తా! ఒక్క ముద్దు ఇవ్వు, నిన్ను వెంటనే పంపిస్తా!' అన్నాడు.

"కన్నీళ్లు కనులంచున నిలిచాయి.

" 'అదే వద్దనేది. ఆ కన్నీళ్లంటే నాకు అసహ్యం' అన్నాడు. పమిట కొంగుతో కళ్లు వొత్తుకున్నాను.

" 'సరూ! నిన్న రాత్రి సినిమా చూశాను. దానిలో క్లబ్ డాన్సర్ అచ్చంగా నీ పోలికలో ఉంది. నిన్ను కూడా ఆ డ్రెస్‌లో చూడాలని ఉంది' అన్నాడు.

"ఈ రాస్కెల్ హద్దులు మీరుతున్నాడు, బుద్ధి చెప్పాలి! ఇక సహనం చూపటం ప్రమాదం అని అనుకుంటూ కళ్లు పెద్దవి చేసి సుందరం మొహంలోకి చూశాను.

" 'సారీ సరూ! నన్ను అలా చూడకు. నాకు భయ మేస్తోంది!' అన్నాడు.

"చూడండీ! మీరు మరోసారి ఇలాంటి మాటలు మాట్లాడితే బాగుండదు!' అన్నాను.

## నెహ్రూ వంటవాడా?

నెహ్రూను సోదరునికన్నా ఎక్కువగా అభిమానించే సరోజినీ నెహ్రూ కుటుంబంతోనే ఎక్కువగా కాలక్షేపం చేసేది. నెహ్రూతో ఆనందభవన్‌లో ఉంటూ అక్కడకు వచ్చేవారికి అతిథి మర్యాదలు చేస్తూ ఉండేది. అక్కడకు వచ్చిన కొందరు శాకాహారమే కావాలనేవారు. కొంతమంది మాంసాహారం లేనిదే ముద్ద ఎత్తేవారు కాదు. మరికొంతమంది గడ్డపెరుగు లేనిదే తినేవారు కాదు. సాధ్యమైనంత వరకు కమలానెహ్రూతో కలిసి వీరి కోర్కెలు తీరుస్తూండేది. ఒక్కొక్కప్పుడు వారి కోరికలు విని చికాకు పడి, "ఏమయ్యా! మీ కిదేమైనా మర్యాదగా ఉందా! మా నెహ్రూ వంటవా డనుకున్నారా! మీ కోరికలన్నీ తీర్చడానికి. అతను భారత రాజకీయవేత్తలలో ఆణిముత్యం. అతన్ని చీకాకు పెట్టకండి!" అని మందలించేది.

సేకరణ : పి.ఎం. సుందరరావు [విజయవాడ]



" 'ఓకే! నీకు నిజంగా ట్రాన్స్‌ఫర్ కావాలా?' అన్నాడు.

"ట్రాన్స్ఫర్ సంగతి సుందరం గారికి పూర్తిగా తెలిసిపోయిందని అర్థమైంది.

" 'ఏమి టలా చూస్తున్నావ్? పిచ్చిదానా! ఆ అసిస్టెంట్ డైరెక్టర్ కోరినంతలో, నీకు సహాయం చేసినంతలో బదిలీ అవుతుం దనుకోవడం వెర్రితనం! నేను బదిలీని ఆమోదించలేదు' అన్నాడు.

"అతని చూపులు, మాటలు భయంకరంగా అనిపించాయి. అతనికి భయం లేదు. భయపడినట్టుగా కనిపించటం ఓ నటన అని అర్థమైంది.

"సరే! ఓ ఉత్తరం డిక్టేట్ చేస్తాను. లేకపోతే ఇంతసేపు ఏం చేశావ్? అని నీ ఫ్రెండ్స్ అడుగుతారు" అని అంటూ ఏదో లెటర్ డిక్టేట్ చేస్తూ, టేబుల్ సొరుగుల్లో నుంచి ప్లేబాయ్ పుస్తకం తీసి టేబుల్ మీద పెట్టి, 'ఇది చూశావా' అని పచ్చి బూతు బొమ్మలు చూపించాడు.

"ఒళ్లు మండిపోయింది. నెత్తురు మరగకాగి, ఆవిరి చిమ్మింది. షార్ట్‌హేండ్ పుస్తకం తీసి విసిరికొట్టాను. కుర్చీలోనుంచి లేచాను.

"సుందరం గబుక్కున కుర్చీలోంచి లేచి నన్ను గట్టిగా కౌగిలించుకుని, ముద్దు పెట్టుకోబోయాడు.

"వేరే మార్గం లేక, దిక్కు తోచక పెద్దగా అరిచి, బలంగా విదిలించుకుని చెంపన ఛెళ్లున కొట్టి, తోసేశాను. ఆ తోపుకి తూలి టేబుల్ మీద పడ్డాడు. తలకి దెబ్బ తగిలింది. నెత్తురు చిమ్మింది. పెద్దగా కేకలు పెట్టాడు. తలుపులు తెరుచుకుని బయటకి వచ్చాడు.

"మా అరుపులకి ఉన్న నలుగురూ పరుగెత్తుకొచ్చారు. అందరూ ఆయన మనుమలే! చప్రాసీ లక్ష్మి సుందరాన్ని అనుమానంగా చూసింది.

"ట్రాన్స్‌ఫర్ నిరాకరించినందుకు నేను కొట్టాను అని కథ అద్భుతంగా అడ్డం తిప్పాడు. నే నెంత మొత్తుకున్నా నా మాట ఎవరూ పట్టించుకోలేదు. చప్రాసీ లక్ష్మి మాత్రం నేను చెప్పింది పూర్తిగా నమ్మింది. సుందరం మనుమలు అతన్ని కారులో డాక్టరు దగ్గరకు తీసుకెళ్లారు.

"నేను ఆటోలో ఇంటికి వచ్చేశాను. గడపలో నిలబడి నాకోసం ఎదురుచూస్తున్న మా అమ్మను చూడగానే దుఃఖం పొంగి పొర్లింది. గట్టిగా పట్టుకుని బోరున ఏడ్చాను. భయం, దిగులు కలిగాయి. రాత్రికి కొద్దిగా జ్వరం వచ్చింది."

చదువుతూ చదువుతూ శ్రీలత కాగితాలు పక్కన పడేసి, "కాశీ! ఇలాంటి పరిస్థితుల్లో ఏ స్త్రీ అయినా ఏం చేస్తుంది?"

"దట్ సుందరం ఈజ్ ఏ లుచ్చా! ఉసేకే మార్నా!" అని ఇంగ్లీషులోనూ, హిందీలోనూ తిట్టాడు.

శ్రీలత మంచినీళ్లు తాగి కళ్లు తుడుచుకుంది.

కాశీ సిగరెట్ వెలిగించాడు.

"పూర్ లేడీ! తరువాత చదువు!" అని కాశీ టేబుల్ మీద చేతులు పెట్టుకుని ముందుకు వంగాడు.

"పోలీస్ కంప్లయింట్ ఇచ్చి గొడవ చేస్తాడేమో నని నాన్నగారు భయపడ్డారు కాని, అలా జరగలేదు.

"ఆదివారం మధ్యాహ్నం జరిగిన సంఘటన తెలుసుకుని నా స్నేహితులంతా ఇంటికొచ్చారు. చాలాసేపు చర్చించుకున్నాము. పోలీసు కంప్లయింట్ ఇవ్వకపోతే డిపార్ట్‌మెంటల్ చర్య తప్పక తీసుకుంటాడు. అప్పు డేం చేయాలి? అన్న ప్రశ్న ఉదయించింది. నాకూ పట్టుదల పెరిగింది. 'ఎంక్వయిరీ'ని ఎదుర్కోడానికే నిర్ణయించుకున్నాను.

"సోమవారం పొద్దున్నే ఆఫీసుకి నిర్భయంగా వెళ్లి సంగతులు తెలుసుకోవాలని వెళ్లబోతుంటే ఆఫీసు చప్రాసీ లక్ష్మిచేత సస్పెన్షన్ ఆర్డరు పంపించారు.

"ఆఫీసు పని సరిగ్గా చేయలేక మరో డిపార్ట్‌మెంట్‌కి బదిలీ కోరితే, ఆ బదిలీ నిరాకరించినందుకు డైరెక్టర్ గారిని నోటికొచ్చినట్టు తిట్టి, కొట్టి తీవ్రంగా గాయపరిచాను అని అభియోగం నాపై మోపబడింది.

"ఆ సస్పెన్షన్ ఆర్డరు చదివి," లక్ష్మి మొన్న నువ్వు కూడా అక్కడే ఉన్నావుగా! ఏం జరిగిందో నీకూ తెలుసుగా?' అన్నాను.

"అమ్మగారూ! క్షమించాలి, తలుపులు వేసి ఉన్న గదిలో ఏం జరిగిందో నా కెలా తెలుస్తుంది?" అని వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లిపోయింది.

"నాకు తెలిసిన అసిస్టెంట్ డైరెక్టర్ కాక, మరొక డైరెక్టర్‌ను ఎంక్వయిరీ ఆఫీసరుగా నియమించారు. ఆయన సుందరంగారికి మంచి స్నేహితుడనీ, వారిద్దరికీ అనేక లావాదేవీ లున్నాయని తెలిసింది. ఆశలు వదులుకున్నాను.

"ఫలితం ఏమైనప్పటికీ నాకు సంబంధించిన విషయాలన్నీ సంపూర్ణంగా రికార్డు రూపంలో ఉండాలని నాన్నగారు సలహా ఇచ్చారు. నా స్నేహితులు కూడా అమాటే అన్నారు. అందుకే ఎంక్వయిరీ ఆఫీసరు కేసును పక్కదోవ పట్టించడానికి ప్రయత్నించినా, అది సాధ్యం కాకుండా ప్రతి చిన్న విషయాన్నీ లిఖితపూర్వకంగా సమర్పించాను.

"ఆ రోజు అసలు బదిలీ ప్రస్తావన కారణంగా సంఘటన జరగలేదనీ, కానీ నన్ను సుందరంగారు తన అధికార హోదాను అడ్డం పెట్టుకుని హింసిస్తుంటే అది భరించలేక, అతని నుంచి తప్పించుకోవటానికే బదిలీ ప్రయత్నించా నని స్పష్టపరిచాను. ప్లేబోయ్ పుస్తకాలు చూపించి అశ్లీలంగా ప్రవర్తించాడన్న విషయాన్ని విశదీకరించాను. నేను కొట్టిన విషయాన్ని ఒప్పుకున్నాను. నేను అలా కొట్టడానికి గల కారణాలు చూపించాను. నా మానరక్షణకు నాకు అంతకన్నా గత్యంతరం లేదన్నాను.

"ఎంక్వయిరీ ఆఫీసరు నా వాదాన్ని నీరుకార్చే ప్రయత్నం చేశాడు. నేను పట్టు విడవకుండా కేసు నడిపించుకున్నాను. నాపక్షంలో సాక్షులు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను ఖాతరు చేయలేదు. సుందరంగారు సాక్ష్యం ఇవ్వకుండా, ఇతరుల చేత ఇప్పించాడు. నేను నా తీవ్రమైన అభ్యంతరం తెలిపాను.

"ఎంక్వయిరీ ఆఫీసరు రిపోర్టు నాకు వ్యతిరేకంగా వచ్చింది. గది నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా నేను సుందరంగారిని బెదిరించినట్టుగా చప్రాసీ లక్ష్మి నాకు వ్యతిరేక సాక్ష్యం చెప్పింది. అది లక్ష్మి తప్పు కాదు. ఆమె భర్త తాగుబోతు. వాడికి డబ్బిచ్చి తాగించారు. వాడు లక్ష్మిని చితకబాది అబద్ధం చెప్పించాడు. అసలు ఏవర్గంలోనైనా స్త్రీ స్వతంత్రురాలేనా?"

ఈ వాక్యం చదివి శ్రీలత కాశీ మొహంలోకి చూసింది.

కాశీ అవునన్నట్టుగా తల ఊపి, "షి ఈజ్ రైట్!" అన్నాడు. శ్రీలత కాశీ మంచితనానికి చిన్నగా నవ్వింది.

"ఫైనల్‌గా నాకు డిస్మిసల్ ఆర్డరు ఇచ్చారు. ఆ ఆర్డరుకి ప్రధానమైన కారణం నా 'మిస్‌కాండక్ట్' అని అన్నారు. ఆ ఆర్డరు చూసి నేను నిరాశ చెందలేదు. ఇలా జరుగుతుందని



## బాటవేసిన నా పాట....

"మహానాయకులు శ్రీ జయప్రకాష్ నారాయణ్, శ్రీ నీలం సంజీవరెడ్డిగారు మా ఊరు వచ్చినప్పుడు బహిరంగ సభ జరిగింది. ఆ బహిరంగ సభలో నేను పాట పాడాను. ఆ పాట నా జీవితాన్ని సినిమా మలుపు తిప్పింది.

"ఆ సాయంత్రం 'సినిమా హాస్య నటుణ్ణి' అని చెప్పుకుంటూ నారాయణమూర్తి అనే ఆయన మా ఇంటికి వచ్చి నా పాటను మెచ్చుకోడం, ఆ తర్వాత ఆయన మా నాన్నకి పరిచయమై, తరచుగా మా ఇంటికి వస్తూ సినిమా జీవితం గురించి ఎన్నో విషయాలు చెప్పేవాడు.

"నటిగా పేరు తెచ్చుకోడానికి ఎంత కష్టపడాలో.. నటి అయినాకా ఆ స్థానం నిలబెట్టుకోడానికి ఇంకా కష్టపడాలి" అనే వారు ఆయన.

'మీ అమ్మాయిని సినిమాల్లో చేర్పించండి. చిన్న వేషాలు వద్దు. హీరోయిన్ ఛాన్స్ వస్తేనే' అనేవారు ఆయన. అలాగే హీరోయిన్ వేషంతోనే నా సినీ జీవితం ప్రారభం అయింది" అన్నారు శ్రీమతి జమునా రమణారావు.

సుధ

ఊహించిందేగా!

"డిపార్ట్‌మెంట్ రూల్స్ననుసరించి అప్పీలు చేసుకున్నాను. ఆ అధికారులను సుందరంగారు తన నక్క వినయాలతో మేనేజ్ చేసుకున్నాడు. నెల రోజులలోపే నా అప్పీలు కూడా డిస్మిస్ అయింది.

"హైకోర్టు కెళ్లాను. నా కర్మకొద్దీ కేసు విచారణకు వచ్చిన రోజున నా సీనియర్ లాయరు ఆయన జూనియర్స్‌కి కేసు అప్పజెప్పి స్వంత పనిమీద ఊరెళ్లారు. జూనియర్ లాయర్‌కి అనుభవం లేక నా కేసు డిస్మిస్ అయింది.

"ఇదీ నా కేసు కథా! నా కథా!"

"చాలా జాలి కలిగించే కేసే!" అని అన్నాడు కాశీ సిగరెట్టు యాష్ ట్రేలో విదిలిస్తూ.

"న న్నేం చేయమంటావు?" అంది శ్రీలత తన భవిష్యత్తు అంతా చెడిపోయినట్టుగా ఫీలవుతూ.

"శ్రీ! కాసేపు రిలాక్స్ అయితే ..."

"ఓకే! అలా బయటకు పోదాం, పద!" అంది శ్రీలత కుర్చీలో నుంచి లేస్తూ.

** ** **

శ్రీలత నరయుని ఇంటికి 'టీ'కి రమ్మని అహ్వానించింది.

కాశీనాథుని ఇంటి దగ్గరే ఉండమని కోరింది.

సాయంకాలం నాలుగు గంటలకు నరయు శ్రీలత ఇంటికి వచ్చింది. కాశీనాథుని నరయుకి పరిచయం చేసింది శ్రీలత.

లేత నీలిమబ్బు వాయిల్ చీర, తెల్ల జాకెట్టు నరయుకి చాలా బాగా సూట్ అయింది. నరయు 'అందంగా కన్నా ఆకర్షణీయంగా ఉంది' అని కాశీనాథ్ అనుకున్నాడు.

'గుండ్రని మొహం, నవ్వినప్పుడు బుగ్గన సొట్ట - ఆకర్షణతోపాటు అందం కూడా తెచ్చిపెట్టాయి' అని శ్రీలత అభిప్రాయపడింది.

'నరయుకి మంచి సంస్కారం, 'మెత్తని' మాట - రెండూ ఉన్నాయంటే ఆ సుందరం 'ఒట్టి వెధవన్నమాట!' అని కాశీనాథ్ నిర్ణయించుకున్నాడు.

'నరయు ఇంత అందంగా ఉంటుంది కనుకనే ఆ సుందరం ఇంతగా ఏడిపించింది! అంటే అందమైన ఆడపిల్లలు ఉద్యోగాలు చేసుకోకూడదా? పాపం నరయు!' ఏవో ఆలోచనలు శ్రీలతకు కలిగాయి.

"నరయూ! నీ ఫైలంతా నాతోపాటు మావారు కూడా చదివారు!" అంది శ్రీలత నరయు కళ్లలోకి చూస్తూ.

నరయు థాంక్స్ చెప్పింది కాశీనాథ్‌కి.

"బహెన్‌జీ! ఫికర్ మత్‌కీజీయే! ఆప్ కా కేస్ ఠీక్ హై!" అన్నాడు కాశీనాథ్.

తన జీవితంలో పరపురుషుడు తనను 'సోదరీ' అని సంబోధించి ధైర్యం చెప్పినందుకు నరయు అతన్ని ఎంతగానో అభినందించింది.

"మిస్ నరయు! మీ కేసు పది రోజుల్లో తేలిపోతుంది."

"అంత త్వరగానా?" ఆశ్చర్యంగా అడిగింది నరయు.

"అవును, సుప్రీం కోర్టు ఇలాంటి కేసుల్లో న్యాయం చేయటంలో ఏమాత్రం జాప్యాన్ని సహించదు" అంది శ్రీలత.



## ఏది మంచి చిత్రం?

తెలుగులో అత్యుత్తమ చిత్రాలు చేసిన దర్శకులలో కె.ప్రత్యగాత్మ ఒకరు. ఉత్తమ చిత్రాల గురించి ఆయన ఇలా చెప్పేవారు.

"నా దృష్టిలో ప్రతి చిత్రం కళా సమన్వితమే. చిత్రాలలో రెండే రకాలు. మంచి చిత్రాలు, చెడు చిత్రాలు. ఆర్థిక విజయంతో ముడిపడని కళాత్మక చిత్రాలు ఉండవు. ఎంత సదుద్దేశంతో సినిమా చేసినా పెట్టుబడి అయినా తిరిగి వచ్చేలా చూసుకోవాలి? వ్యాపారంలో డబ్బు సంపాదించినట్టే సినిమాల్లో కూడా అడ్డదారుల్లో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో వచ్చిన నిర్మాతల వల్లనే సినిమా పరిశ్రమ కలుషితం అవుతోంది!

"అలాగే - ఎప్పటికప్పుడు బాక్సాఫీస్ దగ్గర కనకవర్షం కురిపించిన చిత్రాలను అనుకరించి తియ్యడం కూడా ప్రమాదకరమే! ఒక ఏడు పసుపు పంట మీదనో, పత్తి పంట మీదనో లాభాలు వచ్చాయని అందరూ అ పంటనే పండిస్తే నడుములు విరుగుతాయి కదా? ప్రేక్షకులకు నచ్చేలా సినిమా తియ్యమని యువ దర్శకులను కోరుతున్నాను.అదే మంచి చిత్రం" అంటారు శ్రీ ప్రత్యగాత్మ.

సుబ్రావ్

నరయు మరోసారి తన కృతజ్ఞతను మనసులో తెలుపుకుంది.

"బహెన్‌జీ! మేము రేపు హైదరాబాదు గోయింగ్ టు బ్రింగ్ అవర్ కిడ్స్" అన్నాడు కాశీనాథ్.

"రెండు రోజుల్లో తిరిగి వస్తాం!" అంది శ్రీలత.

** ** **

శ్రీలత నరయు కేసు ఫైల్ చేసింది. తను అన్నట్టుగానే పది రోజుల్లో విచారణకు వచ్చింది.

శ్రీలత ఫైల్ రెడీగా పట్టుకుని ముందు వరుసలో కూర్చుంది.

'విజిటర్స్ గేలరీ'లో నరయు, కాశీనాథ్ కూర్చుని ఉన్నారు.

నరయుకి ఒక్కసారిగా జరిగిన సంఘటనలన్నీ రీళ్లలాగా స్మృతిపథంలో గిర్రున తిరిగాయి. ఆ రోజు జరిగిన భయంకర సంఘటన కళ్లముందు నిలిచేటప్పటికే నరయు గుండ్రని కాటుక కళ్లు అశ్రుమయం అయ్యాయి. సుందరం ఆఫీసు గది, గదిలోని అల్మారాలు, పెద్ద బల్లా, రివాల్వింగ్ చెయిర్, దానిలో కూర్చుని ఖరీదైన 'స్మోక్ గ్లాసెస్ నుండి పెద్ద కళ్లతో ఒళ్లంతా తడుముతున్నట్టుగా తనను చూసి, వ్యంగ్యంగా నవ్వుతూ బూతుపదాన్ని ఉపయోగించి పలుకరిస్తూ ... సుందరం తనను ... !'

"నరయూజీ! అటు చూడండి మీ కేసు స్టార్ట్ అయింది!" అన్నాడు కాశీనాథ్ చెవులు నిక్కపొడుచుకుని శ్రీలత వాదన వినటానికి ప్రయత్నిస్తూ.

ఆ భయంకర ... సుందరం ... గది నుండి బలవంతాన బయట పడినట్టుగా నరయు గబుక్కున పాత స్మృతుల నుండి తేరుకుంది.

శ్రీలత స్వరం సున్నితంగా, గంభీరంగా ఉంది. పలుకు స్పష్టంగా ఉంది.

"స్వతంత్ర భారతదేశంలో స్త్రీలు స్వేచ్ఛగా అర్థరాత్రి పూట తన ఇంటి గడప దాటి వెళ్లగలగటం మాట అటు ఉంచి, ఆఫీసుల్లో స్వేచ్ఛగా ఉద్యోగాలు చేసుకోలేకపోతున్నారు. దానికి కారణం కీచకులు, దుశ్శాసనులు ఆఫీసర్లుగా చెలామణీ అవటం! శివభక్తుడైన రావణాసురుడు సీతను కిడ్నాప్ చేసిన విషయం గుర్తు ఉంటే, విభూతి రేఖలు నుదుట దిద్దుకుని, పవిత్ర రుద్రాక్షలు మెడన ధరించి నా క్లయింట్‌కు బూతు పుస్తకాలు చూపించి, మానసికంగా హింసించి ఆమె శీలం మీద దాడి చేసిన మిస్టర్ సుందరాన్ని చెంప మీద కొట్టిన మాట నిజం!

"ఆ నిస్సహాయ స్థితిలో ఏ స్త్రీ అయినా ఏం చేస్తుందో, ఏం చెయ్యాలో నా క్లయింట్ అదే చేసింది! దీనిలో తప్పేముంది?

"మిస్‌కాండక్ట్ నా క్లయింట్‌ది కాదు, మిస్టర్ సుందరంగారిది!"

"మీరు చెబుతున్న అధికారి ఇప్పుడు ఉద్యోగంలో ఉన్నారా?" అని అడిగారు ప్రధాన న్యాయమూర్తి.

"లేదు, వారం రోజుల క్రితం సస్పెండ్ అయ్యారు."

"కారణం?"

"ఇంట్లో స్నేహితులతో కలిసి బ్లూ ఫిల్మ్స్ చూస్తుంటే ఇంటి ఇరుగుపొరుగు వారు ఫిర్యాదు ఇచ్చిన మీదట పోలీసులు దాడి చేసి ఆ కేసెట్లు స్వాధీనపరచుకుని సుందరం గారిని అరెస్టు చేశారు."

"మీ స్టేట్‌మెంట్‌కి ఆధారం?"

కోర్టు అనుమతితో నరయు హైదరాబాదులో ప్రచురితమైన వార్తా పత్రిక చూపించింది.

వార్తను గవర్నమెంటు వకీలు నిర్ధారణ చేశాడు.

తీర్పు -

"మిస్ నరయుని వెంటనే ఉద్యోగంలో తీసుకుని బకాయి జీతం చెల్లించ"మని కోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

"మిస్టర్ సుందరం 'మిస్‌కాండక్ట్' గురించి ఎంక్వయిరీ చేసి, అదే నిజమైతే చర్య తీసుకోవాల్సింది" అని అధికారులను హెచ్చరించటం జరిగింది!

★